కథానిక

# సమాంతర రేఖలు

పి. సరళాదేవి

ఒక్క ఉరుకులో లోపలపడి బావురుమంది శారద. "నే ఉండలేను జానకీ, నే బ్రతకలేను జానకీ" అని వెక్కివెక్కి ఏడవసాగింది. నా వళ్లు జల్లుమంది - వాళ్ళ దాంపత్యంలో కలతలు వచ్చాయేమోనని.

దగ్గర కూర్చుని మొగం నా వైపు తిప్పుకుని "రఘుపతి ఏమన్నా అన్నాడా శారదా?" అన్నాను.

"రఘుపతా! నన్నా! కలలోనైనా అనుకోవద్దు జానకీ!" అంది నీళ్లతో నిండిన కళ్లనెత్తి. నాకేం అర్థం కాలా.

"అత్త, ఆడబడుచులు లేని నా పాలిట అందరూ అత్తలూ ఆడబడుచులూ అయిపోయారు. ఈ చిత్రవధ నేను భరించలేనమ్మా! ఇంతకన్నా చావే నయమనిపిస్తోంది" మళ్ళా కన్నీరు కట్టలు తెంచుకుంది.

శారదను చూస్తోంటే నా కడుపు తరుక్కుపోయింది. ఏమని ఓదార్చగలను? ఎలా ఓదార్చేది? అందర్నీ ఎదురించయితేనేం- వర్ణాంతరవివాహం చేసుకుంది. ఇద్దరూ టీచరు పనులు చేస్తో ఎటూ లోటులేకుండా ఉన్నారు. అలా అందర్నీ ఎదురించి వర్ణాంతర వివాహం చేసుకున్న శారదను స్నేహితురాలిగా కలిగి ఉన్నానని, పెళ్లయినా ఆమె స్నేహం విడిచిపెట్టలేదని, నన్నే రంపపుకోత కోస్తున్న ఈ సభ్యప్రపంచం శారదని వదిలిపెడుతుందని ఎలా నమ్మగలను? నమ్మి మాత్రం ఏంచేయగలను?

"ఎప్పుడూ ఏ మనిషీ నిర్విచారంగా ఉండడేమో జానకీ! లేకపోతే పెళ్ళి చేసుకుని హాయిగా సంపాదిస్తూ ఎందులోనూ లోటు లేకుండావున్న మాకు ఈ విచారమేమిటిచెప్పు? వీళ్లు మనుషులుకారు, ఇంకేమైనా అయితే అవాలేమోగాని...."

"వాళ్లందరూ ఏమేమో అంటున్నారని బాధపడుతూ కూర్చుంటే ఎలా శారదా? ఇంత ధైర్యం చేసిన దానివి ఇప్పుడిలా అయిపోతున్నావేం?" అన్నాను ఆమె చేతిని చేతిలోకి తీసుకుంటూ.

"ఎంతకని ఓర్చుకోను, దానికీ ఓ హద్దంటూ లేదంటావా? వీళ్లు చేస్తున్న ఒక్కొక్కపని చూస్తూంటే ఒక్కొక్కసారి తల బద్దలుకొట్టుకోవాలనిపిస్తోంది. పెళ్లి చేసుకునివచ్చి కాపరం పెట్టిన వారం రోజులకు ఒకాయనవచ్చి 'మర్యాదగల సంసారులున్న వీధిలో ఇల్లావచ్చి కాపరంచేయడము మంచిది కాదనీ, వేరే ఇంకెక్కడయినాచూసుకోమని' అన్నాడు. అప్పుడు మా హృదయాలు ఎలావుంటాయి చెప్పు మొండి జీవులం కనక అక్కడే దులిపేసు కున్నాం."

అబ్బ! ఎలా అన్నాడు? నోరెలా వచ్చింది. అలా అన్న నోరు ఇంకా సురక్షితంగా ఎందుకుంది? వాడు మర్యాదగల సంసారి! అక్కడికి శారద సంసారం మర్యాదలేనిదేనా? అదే తన కులంలో పెద్దల సమక్షంలో, బాజాబజంత్రీలతో చేసుకుంటే మర్యాదగలదయి పోవును. చెప్పచ్చుకు కొట్టేవాళ్లులేక, లేకేం? ఏ ఆడపిల్ల అన్నగారిచేతో, తండ్రిగారిచేతో దేహశుద్ధి జరిగేవుంటుంది. అలాంటివాళ్లకే ఆ మాట లొచ్చేది కూడా....

"అంతటితో తీరితే బావుండేదే - నేనూ, ఆయనా స్కూలుకి వెళ్తున్నప్పుడూ, వస్తున్నప్పుడూ ఒకటే తొంగితొంగి చూపులూ, ఇకిలింపులూ, సకిలింపులూ. మమ్మల్ని ఆ చివర చూసి ఒకటే దౌడు ఇంట్లోకి, అందర్నీ లాక్కురావడానికి. ఎప్పుడైనా పరాకుగా వుండి మేము దగ్గర కొచ్చేసిన తరువాత కనిపిస్తే 'ఒసే రత్తమ్మా ఒకసారి ఇలా రావే' అని ఏదో పని

కోసం పిలిచినట్టు మాకు వినిపించేట్టే పిలుస్తారు'' బాధతో పరుపుచుట్టకు చేరబడింది.

"నీకు కావలసిన వాళ్లందరూ ఏమనలేక పోయారు. కాని ఈ పరాయి గోలే ఎక్కువగా వుండి నువ్వు ఇక్కడికి వచ్చావు. ఎంతమంది ఈ ఇంటి చుట్టూ పహారా కాస్తోన్నారో-మన చేతలూ, మాటలూ తెలుసుకోడానికి. వీళ్లకెందుకీ కడుపు మంట. బాగా బ్రతుకుతున్న వాళ్లని చూడలేకా?....'' నాకు గుండెలు బరువెక్కిపోయాయి.

''నేను పెళ్ళిచేసుకున్న తరువాత మొదటిసారి మీ ఇంటికి వచ్చినప్పుడు చూశాను—మీ ఇంటి గుమ్మంముంది మీనాక్షి అటూ ఇటూ తిరగడం. తరువాత మీ ఆయనకు చెప్పారని కూడా తెలిసింది. వీళ్ళెలాగయినా పోనీ జానకీ-ఆ పసివాళ్ల మనసులుకూడా మలినం చేసేస్తున్నారు కదా! నాతో చనువుగావున్న పిల్లలందర్నూ ఇప్పుడు దూరదూరంగా వెళ్ళిపోతున్నారు. మేము ఇంట్లో వున్నప్పుడు ఏమిచేస్తున్నామో చూసిరమ్మని ఈ పిల్లల్ని తరుముతారు. 'మీ పంతులు పంతులమ్మ బళ్లో ఎలా వుంటారు?' 'పంతులు పంతులమ్మ నెప్పుడైనా కసురుతాడా?' 'పాఠాలేమైనా చెబుతారా లేకపోతే ఇద్దరూ కబుర్లు చెప్పకుంటూ కూర్చుంటారా?' ఇటువంటి వెధవ ప్రశ్నలన్నిటితో పిల్లల్ని చంపుతున్నారు. పెద్దవాళ్ల వుత్సాహం చూసి వీళ్లుకూడా మేమిద్దరం ఎప్పుడైనా మాట్లాడుకుంటూంటే దొంగతనంగా వింటున్నారు. ఛాఛా.చూస్తోంటే వెర్రెత్తుతోందనుకో.''

''ఇంకొన్నాళ్లు ఓపికపట్టు శారదా! పాతయి పోతే అంతా సర్దుకుంటుంది.''

''వీళ్లిలా ఎన్నాళ్లు కూస్తుంటేమాత్రం మన మేమి చేయగలంలే - బాధపడ్డం తప్ప. మగవాళ్లుకూడా మే మిద్దరం రోడ్డుమీద కనిపిస్తే కళ్లు గిలిగించుకునో, గిల్లుకునో చూపించుకుంటారు. నేను గొప్పఇంటి పిల్లను కావడం వలన రఘుపతి లొంగిపోయాడని. నేనే వంచేశాననీ, అతన్ని లోబరుచుకు అన్నీ చేయించుకుంటున్నాననీ, అసలు నేనే పనీ చెయ్యననీ, అతనుమాత్రం నాయడుగులకుమడుగు లొత్తుతూ నోరెత్తకుండా రాణి వాసాలన్నీ జరుపుతున్నాడనీ, అతన్నలా నొక్కిపట్టి నా ఇష్టమొచ్చినట్టు నేను జల్సాచేస్తున్నాననీ, కన్నవాళ్లకీ, కట్టుకున్నవాడికీ ఒక పీడననీ .... ఒకటేమిటి అక్కసు తీరేదాక, నోటికి వచ్చిందల్లా అంటున్నారు. ఈ పోరే లేకపోతే నిజంగా అన్నిటా నేను చాల అదృష్టవంతురాల్నే జానకీ!'' అంది భారంగా.

''అవన్నీ అభూత కల్పనలేగా! రఘుని తెలీదా? నిన్ను తెలీదా? మీ దాంపత్యం తెలీదా? వాళ్లేదో అరుచుకుంటే అరచుకోనీ. నువ్విలా మనసు పాడుచేసుకుంటే అతను కూడా దిగజారిపోతాడు. అసలు....''

మా ఆయన విసురుగా వచ్చి గదిలో కెళ్ళిపోయారు. నేను గతుక్కుమన్నాను. మాట ఆగిపోయింది. శారద ఇక్కడుండగా చూశారు. ఇవాళేదో తప్పదు. నేను శారదతో తిరుగుతూ చెడిపోతున్నాననీ, శారద ఇక్కడికి వస్తూంటుందనీ-అందరూ ఆయనకు నూరి పోయడమూ, ఆయన రెండుమూడుసార్లు నన్ను మందలించడమూ జరిగింది.

ఇంతకు ముందు శారదతో సరదాగా మాట్లాడుతూన్న మనిషి శారద పెళ్లిచేసుకున్న తరువాత మానేశారు. ఇంతవరకూ శారదా నేనూ కలిసి ఆయనకళ్ళ పడలేదు. ఇప్పుడు పడ్డాం. ఏదో వుంది. ఏమిటో జరిగిపోతుంది. తప్పదు. ఆయన వాలకంలోనే తెలిసిపోతుంది.

నా గుండె దడదడా కొట్టుకుంది. అతి భయం మొండితనంలోకి దారితీస్తుందన్నట్టు మొండితనం వచ్చేసింది. ఏం జరిగితే అది జరగనీ. ఏమన్నా తప్పుచేశానా? స్నేహితురాలితో మాట్లాడాలంతే కదూ.

నా మొగంచూసి శారద లేచి 'వెళ్తా' నంది. శారదలా వెళ్ళగానే ఈయనిలా తుపానులా వచ్చారు.

''దాని వెనకలా తిరగొద్దని నీ కెన్నిమార్లు చెప్పాను?''

''దాని వెనక నేను తిరుగుతున్నానని ఎందుకనుకోవాలి. నా వెనకే అది తిరుగుతుందనుకోండి'' మొండివాదన మొదలు పెట్టాను.

"చఫ్! సిగ్గులేక మళ్ళీ మాట్లాడుతున్నావే! దాన్ని చూస్తోంటె కత్తికట్టి కసితీరా పొడిచేద్దా మనిపిస్తోంది." ఇప్పుడు సరిగ్గా అతని కళ్ళు చూస్తే తెలుస్తుంది అతనిలోని క్రూరత్వమంతా.

"దానికి మిమ్మల్ని చూస్తోంటే అలాగే ఉండొచ్చునేమో?" నాకు వళ్ళు భగభగ మంటోంది.

"ఆ—దానితో చెబుతున్నా వినకుండా సినిమాలూ, షికార్లూ చేయడమే కాకుండా మళ్ళా మాట్లాడతావ్! నువ్వూ అలా ఎవడ్నో లేవ దీసుకుపోకూడదూ — శని విరగడవుతుంది."

నాకు ఒక్క పెట్టున వాంతొచ్చినట్టయింది. ఛీ.ఛీ ఏంమనిషి, ఏమిమాటలు, నేనూ అంతకన్నా పెద్దమాటే అనొచ్చు. కాని నిగ్రహించుకున్నాను తగ్గుతారేమోనని కాని—

"ఊరూ పేరూ లేనివాణ్ణికట్టుకొచ్చి కులుకు తున్న దానితో...."

"అది కట్టుకునొచ్చున్నా కులుకుతోంది. మనం కట్టుకునే దొకర్ని, కులికే దొకరితో."

"నోరుముయ్!"

"ముందు అలివేణి నోరు మూయించండి." చెంప చెళ్ళుమంది.

కథానిక:

# ఏడిపించిన సుహాసిని

వడ్లపట్ల దయానందం

"ఒక కుక్కకి హఠాత్తుగా మాటలొచ్చాయట. అది నరమానవుల వెంటబడుతూ; నా కంటే మీరు దేనిలో ఉత్తములు అని అడగటం మొదలు పెట్టిందట."

"ఏడ్చావంట .... నీ తెలివి తేటలంతకంటె అమోఘంగా ఏడ్చినట్టున్నాయంట .... అవును కానీ .... ఒరేవ్ .... ఇలా చూడు" అన్నాడు వెంకట్.

వాడి అసలు పేరు 'వెంకటప్పయ్య' 'టప్పయ్య' అన్నది 'దేవయ్య'లా బావుండ లేదని, ఒకమ్మాయిని ప్రేమించిన సందర్భంలో జూలియట్ సలహామీద నామ సంస్కారణ గావించుకున్నాడు.

ఏమిటోనని అలా చూశాను చిన్న పేపరు తుంపుని కళ్లతో నమిలి పారేస్తున్నాడు. వాడి సంభ్రమాశ్చర్యాలు చూచేసరికి విస్తుపోక తప్పిందిగాదు. ఎందుకంటె వాడిలో పరిచయ మేర్పడి ఈ ఆరుసంవత్సరాల్లో వాడాశ్చర్యపడ్డ సందర్భాలు బహుఅరుదు.

"అతి పురాతన ప్రేమలేఖ ఒక ఈజిప్టు రాకుమారికి, మరొక రాకుమారుడిచేత ఇటుక మీద వాయబడి పంపబడిందట ప్రేమ లేఖలు వ్రాయడంలో జ్యూలియట్లదేపై చేయట. ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామ సమయంలో దూర ప్రాచ్యంలో ఉన్న ఒక బ్రిటిష్ సైనికు డికి.... అతగాడి ప్రియురాలు ఒక్క వారం రోజుల్లో అక్షరాలా నాలుగువందల ప్రేమలేఖలు ఏకధాటీగా వ్రాసేసిందట....

ఎలిజిబెత్‌రాణి ఆస్థానంలో ఒక యువకుడు ఒక అమ్మాయిని తొలి చూపులోనే ప్రేమించి పారేసి.... మలిచూపులో నిమిత్తం లేకుండానే మూడువందల తొంభైవనిమిది పేజీలు ప్రేమ లేఖ వ్రాశాట్ట.... దానిలో పదాల్ని లెక్కపెట్టగా నాలుగులక్షల పదివేలని తేలిందట. ప్రపంచ చరిత్రలో ప్రజాస్వామిక దేశాల్లో ఏ ప్రతిపక్షం చేత సైతం ఇన్నిపదాలుగల తీర్మానం ఎప్పుడూ చేయబడలేదట.

సంవత్సరంక్రితం పై ఉదంతాలను తెలుసు కున్నప్పుడుమట్టుకు రవ్వంత ఆశ్చర్యపోయి "అబ్బో అయితే అతి ప్రాచీనమైన ప్రేమలేఖ తాలూకూ ఆ ఇటుకని అతి నిడివిగల ప్రేమ లేఖ అసలు లిఖిత ప్రతిని ఏ మ్యూజియమ్ లోనూ భద్రపరచలేదా" అని అడిగాడంతే.

ఇహ....